ఈనాడు వనపర్తి

బుధవారం అక్టోబరు 23, 2024 | 5

పురాల్లో అవినీతి కంపు!



ప్రతి పనికీ డబ్బు వసూలు ● అనిశాకు పట్టుబడ్డ పెబ్బేరు కమిషనర్



పెబ్బేరు పురపాలక కార్యాలయం

పెబ్బేరు, న్యూస్‌టుడే: జిల్లాలోని పురపాలికల్లో అవినీతి కంపు కొడుతోంది. ఏ మున్సిపాలిటీలో చూసినా ప్రతి పనికీ అధికారులు, సిబ్బందికి చేయి తడపనిదే పని కాని పరిస్థితి నెలకొందన్న ఆరోపణలున్నాయి. గుత్తేదారు పెబ్బేరు పట్టణంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చేసేందుకు పుర కమిషనర్ ఆదిశేషు రూ.20 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడమే తాజా నిదర్శనం. పుర కార్యాలయంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల నుంచి మొదలుకొని ప్రతి పనికీ ఓ లెక్క ప్రకారం లంచం డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇంటి నిర్మాణం మంజూరుకు.. నిర్మించిన ఇంటికి నంబర్ రావడం కోసం కొందరు భారీగా లంచం తీసుకుంటున్నారు. వెంచర్లలో 10 శాతం భూమిని ఆక్రమించుకున్న వారి నుంచి, సొంత స్థలాలను క్రమబద్ధీకరణ కోసం, గుత్తేదారులు చేపట్టిన పనులకు బిల్లులు మంజూరుకు లంచం ఇవ్వనిదే దస్త్రం కదిలే పరిస్థితి లేదు.

అవినీతి ఆరోపణలు ఇలా..

- పెబ్బేరులో జనన, మరణ ధ్రువపత్రాలకు రూ.2వేల చొప్పున, పట్టణ ప్రణాళికలో భాగంగా ఇల్లు నిర్మించుకొనేందుకు అనుమతి కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొంటే మంజూరు చేసేందుకు రూ.10-30 వేల వరకు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత నంబర్ కోసం రూ.10-25 వేల వరకు లంచం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పట్టణంలో మురుగు కాల్వలు, సీసీ రోడ్లు నిర్మించిన తర్వాత బిల్లు మంజూరు కావాలంటే వచ్చే బిల్లులో 10 శాతం పుర కమిషనర్‌కు ముట్టజెప్పాల్సిందేనని.. లేకుంటే ఆ బిల్లు ఎన్ని రోజులైనా మంజూరు కాదు అనే విమర్శలున్నాయి.
- ఆత్మకూరు పురపాలికలో అవినీతి ఆరోపణలున్నాయి. స్థలాల క్రమబద్ధీకరణకు డిమాండ్‌ను బట్టి రూ.వేలలో లంచం ఇవ్వాల్సిందే. ఆత్మకూరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు వేసిన వెంచర్లలో 10 శాతం భూమిని చాలా మంది ఆక్రమించుకొన్నారు. ఆ భూమిని ప్రస్తుతం పుర అధికారులు కొందరు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమణదారుల నుంచి డబ్బులు తీసుకొని పనులు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- అమరచింతలో ఇళ్ల నిర్మాణం కోసం ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొంటే వాటి మంజూరుకు రూ.12-20 వేల వరకు లంచం ముట్టజెప్పాల్సి ఉందనే వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. గ్రామ కంఠం భూములను ఆక్రమించుకుంటే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆక్రమించుకున్న వారి నుంచి భారీగా డబ్బు తీసుకోవడమే అందుకు కారణమని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.
- వనపర్తి పురపాలికలో అవినీతి అధికంగా ఉన్నా బయటకు పొక్కనివ్వడం లేదు. అధికారులు, గుత్తేదారులు కుమ్మక్కయి పనులు చేసుకొంటున్నారు. సామాన్యులు మాత్రం ప్రతి పనికీ లెక్క ప్రకారం డబ్బులు ఇచ్చుకోవాలి. ఇంటి అనుమతి, ఇంటి నంబరు, జనన, మరణ ధ్రువపత్రాల మంజూరుకు సైతం పుర కార్యాలయంలో ఉండే కొంతమంది సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఏ పని కావాలన్నా చేతులు తడపాల్సిందే.
- కొత్తకోట పురపాలికలో ప్రతిపక్ష నాయకులు గట్టిగా ఉండటంతో అవినీతి ఆరోపణలు బయటకు రానివ్వడం లేదు. చిన్న పనులకు సైతం పుర సిబ్బంది డబ్బు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఉండే పుర కమిషనర్ లంచం లేనిదే పనులు చేయడం లేదనే ఆరోపణలు ఉండేవి.

ఆదిశేషు ఇంట్లో సోదాలు


తుర్కయంజాల్ పురపాలిక : పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ కందికట్ల ఆదిశేషు తుర్కయంజాల్‌లో నివాసం ఉంటున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన రూ.20 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు పట్టుబడిన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు తుర్కయంజాల్‌లోని ఇంట్లో అనిశా అధికారులు సోదాలు చేపట్టారు. పలు పత్రాలను పరిశీలించినట్లు సమాచారం.



ఆదిశేషు ఇంట్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

బాధ్యతగా విధులు నిర్వహించాలి: ఎస్పీ

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వనపర్తి సీఐ మద్దెల కృష్ణ, పట్టణ ఎస్సై హరిప్రసాద్ రెడ్డి మంగళవారం విధుల్లో చేరిన అనంతరం ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. అనంతరం సీఐ, ఎస్సైలు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.



ఎస్పీ గిరిధర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ మద్దెల కృష్ణ

నగదు తీసుకో.. వేలిముద్ర వేసిపో!





ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ఇదే దందా

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

ఇప్పుడు రేషన్ దుకాణాల్లో ఉచితంగానే బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం తప్ప ఏ ఇతర సరకులు పంపిణీ చేయటం లేదు. ఈ లెక్కన రేషన్ డీలర్ దగ్గర డబ్బులు ఉండొద్దు. కానీ ఏ రేషన్ దుకాణానికి వెళ్లినా డీలర్ ముందరు డబ్బులు పట్టుకుని సిద్ధంగా ఉంటున్నారు. రేషన్ దుకాణానికి వచ్చే లబ్ధిదారులను ఏమాత్రం సంకోచం లేకుండా బియ్యం ఇస్తారా అని నేరుగా అడుగుతున్నారు. వేలిముద్ర వేయించుకుని వారికి బియ్యం కాకుండా డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం రేషన్ దుకాణం నుంచి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇదంతా తెలిసినా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒక్కరిని కూడా పట్టుకున్న దాఖలాలు లేవంటే ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



దుకాణాన్ని సీజ్ చేయకుండా తాళం వేసిన అధికారులు



ఖిల్లాగణపురంలో పట్టుబడ్డ బియ్యం మహబూబ్‌నగర్ పట్టణం రవీంద్రనగర్‌లోని ఓ రేషన్ దుకాణం

పట్టుబడుతున్నది పోలీసులకే : ఉమ్మడి జిల్లాలో 2,024 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 89,95,931 రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు ప్రతినెలా 1,59,386 క్వింటాళ్ల బియ్యం కేటాయిస్తున్నారు. సగం కుటుంబాలు కూడా ఇంటికి బియ్యం తీసుకెళ్లటం లేదు. ఆ బియ్యం మొత్తంలో ఎక్కువ రేషన్ దుకాణాల నుంచి అక్రమంగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నెల 14న ఖిల్లాగణపురం మండల శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద వాహనంలో ఇద్దరు వ్యక్తులు 19 క్వింటాళ్ల ఉచిత బియ్యం తరలిస్తూ సీసీఎస్ పోలీసులకు చిక్కారు. వారిని ఆరా తీస్తే మహబూబ్‌నగర్‌లోని రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సమాచారంతో అధికారులు మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట, రవీంద్రనగర్, శ్రీనివాసకాలనీ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బోర్డు కూడా లేకుండా రవీంద్రనగర్‌లోని చిన్న సందులో నిర్వహిస్తున్న 6వ నంబరు రేషన్ దుకాణం నుంచి బియ్యం తరలించినట్లు గుర్తించి ఆ డీలర్‌పై కేసు నమోదు చేశారు. 17న మానవపాడు మండలం నుంచి 23 క్వింటాళ్ల బియ్యం ఆటోలో పెబ్బేరులోని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా సీసీఎస్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇలా రోజూ ఎక్కడో ఒకచోట బియ్యం అక్రమ రవాణా జరుగుతుండటంతో పోలీసులు పట్టుకుంటున్నారే తప్ప ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవటం లేదు. అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియజేస్తే పట్టుకోవడం సంగతి అటుంచి వారు డీలర్లకే సమాచారం ఇచ్చి అప్రమత్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అనుమానంతోనే జనం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలకు కాకుండా సీసీఎస్ పోలీసులకే సమాచారం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు బియ్యం పట్టుకుని నమోదు చేసిన కేసులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

దుకాణాలపై నిఘా ఏదీ? : రేషన్ దుకాణాల నుంచి ఉచిత బియ్యం తీసుకెళ్లి వినియోగించుకోలేని వారి వద్దకు డీలర్ ప్రతినిధులను పెట్టి కిలో రూ.10 నుంచి రూ.15 చొప్పున ధర చెల్లించి బియ్యం సేకరించేవారు. ఆ బియ్యం ఆటోల్లో రైస్‌మిల్లులకు తరలించేవారు. ఇప్పుడు పంథా పూర్తిగా మార్చేశారు. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకుని రేషన్ దుకాణంలోనే బియ్యం కొనేస్తున్నారు. ఆ బియ్యం ఏరోజుకారోజు రాత్రి రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 84 రేషన్ దుకాణాలు ఉండగా ప్రతినెలా 11,970 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతాయి. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకుని డీలర్లు దాదాపు సగం బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. అన్ని మండలాల్లోనూ ఇదే జరుగుతోంది. ప్రతి నెలా 28వ తేదీ నుంచి బియ్యం కోటా గోదాం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా అవుతుంది. 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తారు. దుకాణానికి బియ్యం చేరిన రోజు నుంచే నిఘా పెట్టాల్సి ఉన్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవట్లేదు.

నిర్వహణ లేక నీరందక!

తరచుగా తెగుతున్న కేఎల్ఐ బ్రాంచి కాల్వ



ముత్తిరెడ్డిపల్లి వద్ద పాటు కాల్వపై ఉన్న యూటీ ఎక్కి కేఎల్ఐ కాల్వలోకి పారుతున్న వర్షపు నీరు

కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వపై నుంచి పాటు కాల్వలు ఉన్నాయి. వర్షపు నీరు పోవడానికి పాటుకాల్వలపై యూటీలు నిర్మాణం చేశారు. భారీ వర్షాలు వస్తే యూటీ ఎక్కిపారి కేఎల్ఐ కాల్వలోకి నీరు ప్రవహిస్తోంది. కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేయక, కాల్వ గట్టు తక్కువగా ఉండటం, పాటుకాల్వపై ఉన్న యూటీల నుంచి వర్షపు నీరు ఎక్కి పారుతుండటంతో తరచుగా తెగిపోతున్నాయి.

సామర్థ్యం 30 వేలు.. సాగు 60 వేలు : ఏటా రెండు పంటలకు సాగునీరు ఇచ్చే కేఎల్ఐ బ్రాంచి కాల్వకు వర్షపు నీటిగండం పట్టుకుంది. కేఎల్ఐలోని పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ, ఉప కాల్వల పరిధిలో 30 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. జొన్నలబొగుడ జలాశయం, గుడిపల్లి జలాశయానికి ఉన్న ప్రధాన కాల్వకు మూడో కిలో మీటర్ వద్ద పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వ ఏర్పాటైంది. ఈ కాల్వ నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని కోడేరు, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని కొన్ని గ్రామాల పంటలకు సాగునీరు అందిస్తుంది. మొత్తం 33 కిలో మీటర్ల పొడవున ఉండగా కోడేరు మండలంలో 12 వేల ఎకరాలు, పాన్‌గల్ మండలంలో 13 వేలు, వీపనగండ్లలో సుమారు 2 వేల నుంచి 5 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అయిదేళ్లుగా మూడు మండలాల్లో మొక్కసారిగా ఆయకట్టు 50 వేల నుంచి 60 వేల ఎకరాలకు సాగు పెరిగింది. ఉప కాల్వల చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లైనింగ్ లేకపోవడంతోనే..: పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వకు మొదటి నుంచి సిమెంట్ లైనింగ్ పనులు చేయలేదు. 33 కిలో మీటర్ల పొడవునా గత ప్రభుత్వ హయాంలో 2023లో సిమెంట్ లైనింగ్ పనులకు రూ. 60 కోట్లతో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పనులకు టెండర్లు పిలవలేదు. సెప్టెంబరులో దాదాపుగా 20 రోజులు కురిసిన భారీ వర్షాలకు ముత్తిరెడ్డిపల్లి, రాజాపూర్ శివారుల్లో బ్రాంచి కాల్వ తెగిపోయే పరిస్థితి నెలకొనడంతో అధికారులే కాల్వకు గండి పెట్టి వాగులకు వరద నీటిని వదిలారు. తెగకుండా చర్యలు చేపట్టారు. కోడేరు, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్ మండలాల్లో ఉన్న ఉప కాల్వలు ఎక్కడపడితే అక్కడ తెగిపోయాయి. మరి కొన్ని కాల్వల్లో జమ్ముగడ్డి, కంపచెట్లు పెరిగాయి.

నిధులు కేటాయిస్తేనే..

పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ మరమ్మతులకు నిధులు లేవు. జమ్ము గడ్డి, పూడిక తీత, కాల్వ గట్టు పెంచడం, కోతలు పడితే మరమ్మతులు, కంపచెట్లు తొలగింపునకు బ్రాంచి, పిల్ల కాల్వల సర్వే చేశాం. రూ. 40 లక్షలతో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.

- రవీందర్, ఈఈ, కేఎల్ఐ, నాగర్‌కర్నూల్

కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టు వద్ద వరద నీటి ఉద్ధృతి కొనసాగుతున్న క్రమంలో ఎగువ, దిగువ జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల్లోని 11 యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. ప్రాజెక్టుకు 98,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్న క్రమంలో జలవిద్యుత్తు ఉత్పత్తికి 35,042 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో ఎగువన ఐదు యూనిట్ల ద్వారా 3. 871, దిగువన ఆరు యూనిట్ల ద్వారా 4. 383 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధ్యపడింది. ప్రస్తుత వర్షాకాలం ఎగువన 297. 654, దిగువన 28. 958 మిలియన్ యూనిట్లుగా జల విద్యుత్తు ఉత్పత్తి నమోదైనట్లు జెన్‌కో ఎస్ఈ (ఓఅండ్ఎం) సూరిబాబు తెలిపారు.

జూరాల గేట్ల మూసివేత

ధరూరు, న్యూస్‌టుడే: జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గటంతో దిగువకు గేట్ల ద్వారా నీటి విడుదల నిలిపివేసి జలవిద్యుదుత్పత్తి ద్వారా మాత్రమే వదులుతున్నారు. జలాశయంలోకి 64వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు జలవిద్యుదుత్పత్తి ద్వారా 37వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణ్‌పూర్ జలాశయాలకు సైతం వరద తగ్గుముఖం పట్టింది. ఆలమట్టిలోకి 38వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా 37వేలు దిగువకు వదులుతున్నారు. నారాయణ్‌పూర్‌లోకి 31వేల క్యూసెక్కులు చేరుతుండగా 26 వేలు వదులుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యార్థుల ఆందోళన



కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గోపాల్‌పేట రోడ్డులో ఉన్న జవహర్ లాల్ నెహ్రూ ఇంజినీరింగ్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని మంగళవారం విద్యార్థులు తరగతులు బహిష్కరించి రోడ్డుపై బైఠాయించి రెండు గంటల పాటు నిరసన తెలిపారు. విద్యార్థులకు ఏబీవీపీ, భారాస విద్యార్థి విభాగం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ కళాశాలలో సివిల్, మెకానికల్, ఈసీఈ, సీఎస్ఎం, సీఎస్ఈ బ్రాంచిల్లో మొత్తం 700 మంది విద్యార్థులు ఉన్నామని, పీజీ కాలేజీలో 7 గదులు ఇంజినీరింగ్ కళాశాలకు కేటాయించారని అందులో తరగతుల నిర్వహణ కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలో కొత్తగా మొదటి సంవత్సరం విద్యార్థులు రావడం వల్ల వారికి బాలానగర్‌లో ఓ భవనంలో తరగతులు నిర్వహించడానికి కళాశాల యాజమాన్యం సిద్ధమయ్యారు. దీంతో విద్యార్థులు అందరికీ ఒకే చోట తరగతులు నిర్వహించాలని, కళాశాలలో శాశ్వత అధ్యాపకులు, సొంత భవనం, వసతి గృహంలో నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వరరావు ఘటన స్థలానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వారం రోజు సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీ ఏర్పాటు

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సోళీపూర్ గ్రామంలో గ్రామ ప్రత్యేకాధికారి అంకె రాజు ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ వనపర్తి వారి సమక్షంలో గ్రామ స్థాయి బాలల సంరక్షణ కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలల సంరక్షణ కమిటీ అధికారిని యాదమ్మ మాట్లాడుతూ బాలల సంరక్షణ కమిటీ ద్వారా గ్రామంలో బాల్య వివాహాలను అరికట్టడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, బాలల హక్కులను కాపాడటం వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో గ్రేడ్2 సూపర్‌వైజర్ ఈదమ్మ, పంచాయతీ కార్యదర్శి, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలు తగలబెట్టొద్దు



అమరచింత : సమావేశంలో మాట్లాడుతున్న కొత్తకోట డివిజన్ ఏడీఏ దామోదర్

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లాలోని రైతులు కోతల తర్వాత వరి కొయ్యలను, గడ్డిని పొలాల్లో తగలబెడుతున్నారు, అలా చేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలా కాలంగా రైతులు గడ్డిని తగులబెడుతున్న విషయంపై శాస్త్రవేత్తలు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. వరిగడ్డిని పశువులకు మేతగా వినియోగించుకోవాలని, అవసరం లేని రైతులు, అవసరం ఉన్న రైతులకు గడ్డిని ఇవ్వడం వలన వారికి లాభం జరుగుతుందన్నారు. జిల్లాలోని రైతులంతా ఈసారి పంటల కోతల తర్వాత వరి గడ్డిని, కొయ్యలను తగులబెట్టవద్దని ఆయన సూచించారు.

అమరచింత, న్యూస్‌టుడే: రైతులు వరి పంట కోసిన తర్వాత పొలంలోని గడ్డి, పంట అవశేషాలను తగలబెట్టకూడదని కొత్తకోట డివిజన్ ఏడీఏ దామోదర్ అన్నారు. మంగళవారం అమరచింత మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన ఏవో, ఏఈవోల అవగాహన సమావేశంలో మాట్లాడారు. పంట అవశేషాలు మట్టిలో కలిపి దున్నడం ద్వారా భూసారం పెరిగి తద్వారా భూమికి నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. సమావేశంలో ఏవో అరవింద్, ఏఈవోలు శివ, మల్లేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: రాఖీ పౌర్ణమి, దసరా పండగల సందర్భంగా మహబూబ్‌నగర్ రీజియన్‌లోని ఆర్టీసీ కార్మికులు సమష్టిగా కష్టపడి భారీ ఆదాయాన్ని సమకూర్చారని ఆర్ఎం వి.శ్రీదేవి అన్నారు. మంగళవారం ఆర్టీసీ సమావేశ మందిరంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేసి మాట్లాడారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రీజియన్‌లోని ఎక్కువ ఆదాం వచ్చే కృషిచేసిన 13 మంది ఆర్టీసీ డ్రైవర్లు, అయిదుగురు అద్దె బస్సు డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, మెకానిక్, ఎలక్ట్రీషియన్, శ్రామిక్ ఒక్కొక్కరికి అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ బస్‌స్టేషన్‌గా వనపర్తికి బహుమతి అందజేశారు. ఉప ఆర్ఎంలు శ్యామల, లక్ష్మీధర్మ వివిధ డిపోల డీఎంలు, సహాయ మేనేజర్లు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్ఎం వి.శ్రీదేవి

ఈ సారీ.. భరోసా లేదు మరి!



కొత్తకోట, గద్వాల, న్యూస్‌టుడే: రైతులకు ఒకే విడతలో రూ.2 లక్షలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం వానాకాలం పంటలకు రైతుభరోసా ఇచ్చి తీరుతుందని గట్టి నమ్మకం ఉండేది. ఆ నమ్మకంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీళ్లు చల్లేశారు. జులైలో రైతుల సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాల్ని తీసుకున్నప్పటికీ 'రైతు భరోసా' ఎవరికి ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వానికి స్పష్టత రాకపోవడంతో వానాకాలం పంటలకు రైతుభరోసా ఇవ్వడం లేదంటూ మంత్రి స్పష్టం చేయడంతో రైతులకు నిరాశే మిగిలింది.

ఆరేళ్లుగా సాయం..: రైతులకు పెట్టుబడి సాయం అందించి వారిలో ఉత్సాహం నింపి సాగును క్రమంగా పెంచవచ్చని, పెట్టుబడి కోసం అప్పులు చేయరాదని భారాస హయాంలో రైతుబంధు పథకాన్ని ప్రకటించింది. 2018 మేలో తొలిసారి పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారు. తొలి ఏడాది వానాకాలం, యాసంగి పంటలకు కలిపి రెండు విడతల్లో రూ.4 వేల చొప్పున ఎకరాకు రూ.8 వేలు అందజేయగా తర్వాత ఏడాది నుంచి ఏటా రెండు విడతల్లో మొత్తం రూ.10 వేలు అందజేస్తూ వచ్చారు. ఇలా క్రమం తప్పకుండా ఆరేళ్లు పథకాన్ని అమలు చేశారు. గత డిసెంబర్‌లో అందాల్సిన యాసంగి రైతుబంధు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోగా వాటిని ఈ ఏడాది జులైలో విడుదల చేశారు. ఇదే పథకాన్ని 'రైతు భరోసా' పేరుతో ఏడాదికి రెండు విడతల్లో రూ. 7,500 చొప్పున రూ. 15 వేలు అందజేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నిధుల్ని దుర్వినియోగం చేస్తూ వ్యవసాయదారులకే కాకుండా స్థిరాస్తి వ్యాపారులకు, గుట్టలకు పుట్టలకు వీటిని అందజేసిందని, నిజమైన రైతుల కంటే బడాబాబులే ఎక్కువ లబ్ధి పొందారని వారిని ఏరి పారేసి రైతులకు భరోసా అందజేస్తామంది. ఈ క్రమంలో జూన్‌లోనే పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. అయినా మంత్రి వర్గ ఉపసంఘంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రైతు భరోసాకు వానాకాలం నిధులకు బ్రేక్ పడింది. యాసంగి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది.

తెరచుకోని పోర్టల్ : మరోవైపు రైతుభరోసా నమోదు చేసుకునే అవకాశం కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు దక్కించుకున్న రైతులు జూన్ నాటికి రాష్ట్ర వ్యవసాయ శాఖ పోర్టల్‌కు సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి దస్త్రాలు బదిలీ కావాల్సి ఉంటుంది. జూన్ తర్వాత ఈ పోర్టల్ తెరచుకోలేదని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే పలు దఫాలుగా రైతుబంధును కోల్పోగా వచ్చే సీజన్ నాటికైనా రైతుభరోసాను అందుకోవాలని ఆశిస్తున్నారు.



- రైతుభరోసా అందుతుందని ఎంతో ఆశ పడ్డాం. పెట్టుబడి సాయం అందుతుందని ప్రైవేటులో వడ్డీలకు తెచ్చుకున్నాం. ఇప్పుడు సాయం దక్కకపోవడంతో పంటలపై వాటిని కట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వెంటనే యాసంగి పంటల భరోసానైనా విడుదల చేసి రైతులకు అండగా నిలవాలి.

- జలంధర్‌రెడ్డి, కొత్తకోట

ఉమ్మడి జిల్లాలో గత యాసంగి ఇదీ పరిస్థితి..

జిల్లా	లబ్ధిదారులు	ఎకరాలు	నిధులు(రూ.కోట్లలో)
మహబూబ్‌నగర్	1,90935	4,44,853	222. 40
నాగర్‌కర్నూల్	2,68,363	7,30. 311	365. 14
వనపర్తి	1,52,513	3,58,848	179. 42
జోగులాంబ గద్వాల	1,51,963	4,47,427	223. 69
నారాయణపేట	1,55,511	4,47,252	223. 62

చట్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు న్యాయచట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని అన్నారు. మంగళవారం నాగవరం సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పోక్సో చట్టం, పిల్లల సంరక్షణ చట్టం విధి విధానాలు శిక్షలపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ హాలీమా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తే చర్యలు

ఖిల్లాగణపురం : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ నగేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సర్వే నంబరులో వెంచర్లు వేసేందుకు ప్రైవేటు వ్యక్తులు దరఖాస్తు చేసుకోగా ఆ స్థలాన్ని ఉపతహసీల్దార్ దుబ్బాక పరమేశ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. వెంచర్ నిర్మాణ స్థలంలో ప్రభుత్వ భూములు, చెరువులు, కాల్వలు లేకుండా ఉండేలా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడే వెంచర్లు వేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

గోపాల్‌పేటలో 13.0 మి.మీ. వర్షం

వనపర్తి వ్యవసాయం, న్యూస్‌టుడే: సోమవారం ఉదయం 8.30గంటల నుంచి మంగళవారం ఉదయం 8.30గంటల వరకు గోపాల్‌పేటలో 13.0మిమీ వర్షపాతం నమోదైంది. పాన్‌గల్‌లో 5.3మిమీ, వనపర్తిలో 4.5మిమీ, రేవల్లి, ఖిల్లాగణపురంలో 4.0మిమీ వర్షపాతం నమోదైందని, జిల్లాలోని మిగతా మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదని టీజీడీపీఎస్ ఏడీ మక్సూద్‌మియా తెలిపారు.

72 పరుగుల తేడాతో మహబూబ్‌నగర్ క్రికెట్ జట్టు విజయం

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) రాష్ట్రస్థాయి టోర్నీ కోసం ముందస్తుగా ఉమ్మడి జిల్లా అండర్-23 క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. మంగళవారం పిల్లలమర్రి దారిలోని ఎండీసీఏ మైదానంలో నిర్వహించిన తొలి పోరులో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నారాయణపేట జిల్లా జట్టుపై 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లకు గాను 47 ఓవర్లలో 220 పరుగులకు ఆలౌట్ అయింది. అక్షయ్ 84, అరుణ్ 46, కార్తిక్ 24 పరుగులు చేశారు. నారాయణపేట నుంచి ఎజాజ్ 5, రాజు 2 వికెట్లు తీశారు. నారాయణపేట జట్టు లక్ష్య ఛేదనలో చతికిలపడి 35.3 ఓవర్లలో కేవలం 148 పరుగులు చేసి ఓడింది. తరుణ్ 30, అద్నాన్ 28 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ నుంచి ముఖీత్ 4, అంజి 3 వికెట్లు తీశారు. పోటీలను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ ప్రారంభించారు. శిక్షకుడు అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పరిహారం.. స్వాహాపర్వం

గద్వాల పట్టణ ఠాణాలో కేసు నమోదు

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు పరిహారం రెండో సారి పొందేందుకు న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి చేతివాటం ప్రదర్శించి అడ్డంగా దొరికిపోయారు. మోసాన్ని నేరుగా న్యాయమూర్తి గుర్తించడంతో పలు మోసాలు వెలుగు చూశాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు భూమి బాధితులు పరిహారం పొందారు. పరిహారం న్యాయస్థానం ద్వారా బాధితులు తీసుకున్న పరిహారం తాలూకా న్యాయస్థానం రిజిస్టర్లలో రికార్డు అయి ఉన్నాయి. అయితే బాధితుల పేరిట గుట్టుచప్పుడు కాకుండా రెండోసారి పరిహారం పొందేందుకు(డబుల్ క్లెయిమ్) న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి కొందరి సహకారంతో స్కెచ్ వేశారు. అందులో భాగంగా ఇది వరకే పరిహారం పొందిన వారి పేరిట ఉన్న వివరాలను ట్రైబ్యునల్ ద్వారా సరి చేసి వేరే వ్యక్తి పేరిట రెండో సారి పరిహారం పొందేందుకు ప్రయత్నించారు. ఇలా పలు విడతల్లో సుమారు 2016 నుంచి 2021 వరకు అధికారికంగా రూ. 3.08 కోట్లను తన పేరిట, తన భార్య పేరిట డిపాజిట్ చేశారు. అయితే ఈ వ్యవహారం రూ.4 కోట్లకు పైగా ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ముంపునకు గురయ్యే భూములను కోల్పోయిన బాధితుల రికార్డులను న్యాయమూర్తి పరిశీలించే క్రమంలో రూ. 52,45,850 విలువ చెక్కు, 2021లో ఓ మహిళకు జారీచేయగా, అదే మొత్తంలో పరిహారం పొందిన ఓ వ్యక్తి పేరుపై ట్రైబ్యునల్(ట్యాంపర్) చేసినట్లు గుర్తించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ క్రమంలో రికార్డులను, కంప్యూటర్ డాటాను లోతుగా విచారించడంతో సదరు అధికారి పలు విడతల్లో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దీంతో అధికారికి, తన భార్యకు పోలీసు నోటీసు జారీ చేశారు. విషయాన్ని హైకోర్టు దృష్టికి న్యాయమూర్తి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశానుసారం రెండు రోజులుగా ఉన్నత స్థాయి అధికారులు లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఫిర్యాదు మేరకు సోమవారం గద్వాల పట్టణ ఠాణాలో అక్రమాలకు పాల్పడిన అధికారి, అతని భార్యపై కేసు నమోదైనట్లు గద్వాల డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని, ముంపు పరిహారం రెండో సారి పొందేందుకు ప్రయత్నించిన మరికొందరు గద్వాల సీఐ టంగుటూరి శ్రీను విచారణాధికారిగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

ప్రస్తుతానికి గుర్తించిన రెండోసారి పరిహారం జమ వివరాలు

తేదీ	నగదు (రూ.)
23.12.2016	3,35,000
18.02.2017	8,68,227
29.04.2017	8,22,180
23.11.2017	21,66,026
16.03.2018	33,03,117
20.05.2019	69,47,120
17.12.2019	85,46,420
09.04.2021	52,45,850
16.08.2021	25,98,250

చేనేత సహకార సంఘం పనితీరు భేష్

అమరచింత, న్యూస్‌టుడే: అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సహకార సంఘం పనితీరు సంతృప్తికరంగా ఉందని వివిధ రాష్ట్రాల నాబార్డ్ అధికారులు కొనియాడారు. పట్టణ శివారులోని సహకార సంఘాన్ని మంగళవారం కర్ణాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి నాబార్డ్ అధ్యర్యంలో 50 మంది సభ్యులు సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాబార్డ్, డీసీసీబీ బ్యాంకు అధికారుల చేయూతతో అమరచింత పట్టణంలోని చేనేత కార్మికులు సంఘం ఎలా ఏర్పాటు చేసుకున్నారో అమరచింత సహకార సంఘం సీఈవో చంద్రశేఖర్ వారికి వివరించారు. చేనేత కార్మికుడు ఒక యజమాని వద్ద చేనేత పని చేయకుండా స్వయంగా ఇక్కడ మగ్గం ఏర్పాటు చేసుకుని సంఘం ద్వారా విక్రయించడంతో, వచ్చిన లాభాన్ని ప్రతి ఏడాది తీసుకోవడం జరిగిందన్నారు. ఇంట్లో మగ్గం ఏర్పాటుకు స్థలం లేనివారు కూడా ఇక్కడ నేత పనిలో ఉన్నట్లు చెప్పారు. సంఘం ద్వారా జరిగే ప్రతి ఖర్చు, జమ అంశాల్లోనూ నమోదు చేయడంతో పాటు ప్రభుత్వానికి నాబార్డు ద్వారా నివేదిస్తున్నట్లు వివరించారు. డీసీసీబీ బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించి వారికి వచ్చే నెల వారీ వేతనంలో అప్పు చెల్లించే విధంగా చేశామన్నారు. కర్ణాటక డీజీఎం సతీష్ కర్త, బీఆర్‌డీ డీజీఎం యోగేష్, నాబార్డు అధికారి శ్యాంసుందర్ చారి, డీసీసీబీ ఉత్కూరు మేనేజర్ నబీ, సభ్యులు పాల్గొన్నారు.



మగ్గంపై నేస్తున్న చీరను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

తపాలా.. పడిలేచిన కెరటంలా

వినియోగదారుల ఆకర్షణకు కొత్త పథకాలు

న్యూస్‌టుడే, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి: పడిలేచిన కెరటంలా తపాలా శాఖ కొత్తపుంతలు తొక్కుతూ, నూతన పథకాల అమలుతో పునరుజ్జీవం పొందుతోంది. ఒకప్పుడు తపాలా అంటే కేవలం ఉత్తరాల బట్వాడాకే పరిమితం. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కొత్త పథకాలతో ప్రజల్లోకి వెళ్తూ ఆదరణ పొందుతోంది. దేశంలోని ఏ ప్రాంతానికైనా పార్సిల్ పంపే సౌకర్యం నేడు ఇంటింటికీ వ్యాపింపజేసింది. కొన్ని ప్రైవేట్ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. కమ్యూనికేషన్ విభాగంలో ప్రైవేటు కొరియర్ సంస్థలు హవా నడుస్తున్న తరుణంలో తపాలా శాఖ మూసధోరణికి స్వస్తి పలికింది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు పొదుపు పథకాలతోపాటు, ఇతర సేవలు అందిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా తపాలా వారోత్సవాలు జరుపుతూ ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా అధికారి సృజన్ నాయక్ తెలిపారు. మేళాలు నిర్వహించి కుటుంబానికి ఉపయోగపడే కొత్తపథకాలను ఈనెల 7 నుంచి వారం పాటు పరిచయం చేసినట్లు పేర్కొన్నారు.

జవసత్వాలు..: 170ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న తపాలా శాఖ పడిలేచిన కెరటంలా నూతనోత్తేజంతో ముందుకు సాగుతోంది. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలతో పోటీపడుతూనే బ్యాంకు సేవలు కూడా అందించేందుకు తపాలా బ్యాంకుగా అవతరించి సేవలు అందిస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

డివిజన్లు: వనపర్తి, మహబూబ్‌నగర్

4 హెడ్‌పోస్టాఫీసులు

76 సబ్‌పోస్టాఫీసులు

822 బ్రాంచి పోస్టాఫీసులు

4.80 లక్షలు తపాలా పొదుపు ఖాతాలు

6 లక్షలు తపాలా బ్యాంకు ఖాతాలు, జీవిత బీమా పథకాలు

48 వేలు సుకన్య పొదుపు ఖాతాలు

1.50 లక్షలు ఆసరా పింఛన్ల పంపిణీ

2.80 లక్షల మందికి ఉపాధి చెల్లింపులు



బిజినేపల్లి మండలం మహదేవునిపేటలో బాధితులకు రూ.15లక్షల చెక్కు అందిస్తున్న తపాలా అధికారులు

డాక్ నిర్యత్ కేంద్ర్..

ఇప్పటివరకు కేవలం దేశంలోనే పార్సిల్లు పంపే సౌకర్యం ఉండేది. గతేడాది నుంచి డాక్ నిర్యత్ కేంద్ర్ అనే నూతన పథకంతో తపాలా శాఖ విదేశాలకు వినియోగదారులు తమ ఇళ్ల వద్ద నుంచే పార్సిల్ పంపే అవకాశం కల్పించింది. తపాలా కార్యాలయంలో ఆధార్, పాన్‌తో పేరు నమోదు చేసుకుంటే సదరు వినియోగదారుకు ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఇండియా పోస్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఇంటి నుంచే పార్సిళ్లు బుక్ చేసే అవకాశం ఉంటుంది. తపాలా సిబ్బంది ఆయా అడ్రస్‌కు చేరుకుని పార్సిళ్లు తీసుకెళ్లడం, డెలివరీ చేయడం చేస్తారు. తక్కువ వ్యవధిలో, తక్కువ రుసుముతో ఈ సౌకర్యం ఏర్పాటుచేయడంతో జిల్లాకేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాలకు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లాకేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాల్లో నిత్యం ఈ పథకం ద్వారా విదేశాలకు పార్సిళ్ల పంపకం పెరగడంతో దాదాపు వేల రూపాయల ఆదాయం సమకూరుతోంది.

DAK GHAR NIRYAT KENDRA

ఈ కామర్స్‌తో ఒప్పందం..

ప్రస్తుతం ఈ కామర్స్ సంస్థలు శరవేగంగా తమ సర్వీసులు అందిస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకుంటూనే పోస్టల్‌శాఖ వాటితో జతకట్టి దేశవ్యాప్తంగా పార్సిల్ సేవలు అందిస్తోంది. దాదాపు ప్రతి గ్రామీణ ప్రాంతాలలో పోస్టల్ సేవలు ఉండటంతో ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థ పోస్టల్‌శాఖతో ఒప్పందం కుదర్చుకుంది. దీంతో అమెజాన్‌లో బుక్‌చేసే పార్సిల్లు పోస్టుసిబ్బంది బట్వాడా చేయనున్నారు. దీంతో పోస్టల్‌కు అధనపు ఆదాయం సమకూరనుంది. ఈ కామర్స్ ఒప్పందంతో తపాలా ద్వారా నాణ్యమైన, మన్నికైన సేవలు అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా అధికారి సృజన్‌నాయక్ వివరించారు

India Post enters in E-commerce
Seller Registration Process
भारतीय डाक Indian Post

గ్రామీణ ప్రాంతాల్లోనూ 73 రకాల సేవలు..



కామన్ సర్వీస్ సెంటర్ల మాదిరిగా తపాలా కార్యాలయాలు కూడా పనిచేయనున్నాయి. 73రకాల సేవలు గ్రామీణప్రాంతాలలో అందిస్తున్నాయి. కరెంటు బిల్లులు, బస్, ట్రైన్ బుకింగ్, పాస్‌పోర్ట్ సేవలు (వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో) అందిస్తున్నారు. పోస్ట్ సేవింగ్‌బ్యాంకు ఖాతాలతో తపాలాబ్యాంకు ఖాతాలను అనుసంధానం చేస్తుండటంతో బ్యాంకు లావాదేవీలు చరవాణీలలోనే చేసుకునే వెసులుబాటు ఉంటోంది. సేవింగ్ ఖాతాలకు ఏటీఎం కార్డు సౌకర్యం కూడా తపాలా శాఖ కల్పించింది. జిల్లాకేంద్రాలలో తపాలా కార్యాలయాల వద్ద ఏటీఎం కేంద్రాలను కూడా ఏర్పాటుచేసింది. దీంతో తపాలా శాఖకు నిత్యం రూ.వేల ఆదాయం సమకూరుతోంది.

బ్యాంకు సేవలతో...

India Post Payments Bank
Aapka bank, aapke dwaar

తపాలా కార్యాలయాలు కేవలం ఉత్తరాల బట్వాడా, పొదుపుఖాతాలకే పరిమితం కాకుండా బ్యాంకు సేవలు అందించేందుకు ఏడేళ్ల క్రితం ఇండియా పోస్ట్ పేమెంటు బ్యాంకు గా సేవలు మొదలు పెట్టింది. వీటి ద్వారా ఆధార్ ఎనబుల్ సిస్టంతో లబ్ధిదారుల ఇండ్లవద్దే వారి బ్యాంకు లావాదేవీలు , చెల్లింపులు చేస్తోంది. ప్రమాదబీమా, ఇతర బీమా పథకాలు అందిస్తోంది. తపాలా బ్యాంకు ఏర్పాటుతో రుణాల మంజూరుకు కూడా శ్రీకారం చుడుతోంది. ఇతర బ్యాంకులు ఏమేమి సేవలు అందిస్తాయో, వాటికి ధీటుగా గ్రామాలలో తపాలా బ్యాంకు సేవలు అందించేందుకు తపాలా శాఖ నడుంబిగించింది. దీంతో తపాలా శాఖ ఆర్థికపరిపుష్టితో పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది.

ఆదరణ బాగుంది..



చిన్నమొత్తాల పొదుపుఖాతాలతో పాటు తపాలా జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా, రికరింగ్ డిపాజిట్టు, సేవింగ్ ఖాతాలు, ఈ-సేవ, సుకన్య సమృద్ధి యోజన పేరిట ఆడపిల్లలకు పొదుపు పథకాలు ఆదరణ పొందాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చెల్లింపులు, ఆసరా పింఛన్లు బయోమెట్రిక్ ద్వారా చెల్లిస్తున్నాం.. అటల్ పింఛన్ యోజన, సీనియర్ సిటిజన్ పథకం, ప్రధాన మంత్రి జీవన బీమా, మంత్లీ ఇన్ కమ్ పథకం, తదితర పథకాలున్నాయి. ఏడాది వ్యవధిగల ప్రమాదబీమా పథకంలో రూ.599 ప్రీమియం చెల్లించి రూ. 10 లక్షల పరిహారం పథకం, రూ.799 చెల్లిస్తే రూ.15లక్షలు పరిహారం అందనుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 బాధిత కుటుంబాలకు పరిహారం ఇచ్చాం.

- భూమన్న, వనపర్తి డివిజన్ పర్యవేక్షకులు

24న బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో ఈ నెల 24న సీతారాముల కల్యాణం ఏర్పాటు చేసినట్లు కోదండ రామాలయ మేనేజర్ సురేందర్ రాజు తెలిపారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండరామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ మేనేజర్ సూచించారు.


చదువు రాకపోయినా ఆంగ్లంలో చేవ్రాలు!

సిబ్బంది పేరిట దొంగ సంతకాలతో నిధులు స్వాహా

వారంతా కిందిస్థాయి సిబ్బంది.. చెప్పిన పని చేసి వెళ్లడం తప్పా.. ఏనాడు ఇదేంటని ప్రశ్నించలేని అమాయకత్వం.. ఎన్నికల సందర్భంగా వారి పేరిట ప్రోత్సాహక నిధులు విడుదలయ్యాయి. వారికి తెలియకుండా అధికారులే దిగమింగారు. కనీస చదువు రాని వారు ఆంగ్లంలో సంతకం చేసిన డాక్యుమెంట్ బయటపడటంతో అవినీతి వెలుగులోకి వచ్చింది. అప్రమత్తమైన సదరు అక్రమార్కులు సిబ్బందిని పిలిచి తలా కొంత ఇస్తాం తీసుకోండి అంటే ఆత్మాభిమానంతో 'మాకొద్దంటూ..' వెళ్లడం కొసమెరుపు.

- న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పార్లమెంటరీ ఎన్నికల సమయంలో పనిచేసిన కార్మికులకు డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా తప్పుడు సంతకాలు పెట్టుకొని నిధులు డ్రా చేసుకున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో గుసగుసలు మొదలయ్యాయి. ఎంపీ ఎన్నికల సమయంలో నిధుల విషయంలో పక్కదారి పట్టించారనే విమర్శలున్నాయి. కలెక్టరేట్‌లో స్వీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది, గార్డెన్‌లో పనిచేసే సిబ్బంది మొత్తం 20 మంది వరకు ఎంపీ ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించారు. కాని ఎవ్వరికి డబ్బులు ఇవ్వలేదు. ఒక్కరికి మాత్రమే రూ.18 వేలు చెల్లించారు. మిగతా వారికి డబ్బులు ఇవ్వకపోగా 13 మందికి రూ.18వేల చొప్పున డబ్బులు చెల్లించినట్లుగా దొంగ సంతకాలు పెట్టి నిధులు డ్రా చేసుకున్నారు. గార్డెన్‌లో పని చేసే వారికి చదువు రాదు కానీ రెవెన్యూ స్టాంప్‌పై ఆంగ్లంలో సంతకాలు పెట్టుకోవడం చర్చనీయాంశమైంది. అన్ని ఒక్కరే సంతకాలు పెట్టినట్లుగా సమాచారం. ఈ విషయం బయటికి రావడంతో ఇటీవల కలెక్టరేట్‌లో ఉండే అధికారులు పనిచేసిన వారిని పిలిచి రూ.2వేలు, రూ.5వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో తమకు ఈ డబ్బులు వద్దంటూ వెళ్లిపోయారు. జిల్లాలో ఎన్నికల విధుల చెల్లింపుల్లో అవకతవకలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారోనని ఉత్కంఠ నెలకొంది.



రెవెన్యూ స్టాంప్‌లపై తప్పుడు సంతకాలు పెట్టినట్లుగా బయటికి వచ్చిన పత్రాలు





ఇదీ అంగన్వాడీ దుస్థితి

అంగన్వాడీ కేంద్రాలు ఎలాంటి వసతి సమస్యలు ఎదుర్కొంటున్నాయో ఈ చిత్రాలను చూస్తే తెలుస్తుంది. ఊట్కూరు మండలం పులిమామిడిలో సరైన భవనాలు లేక నాలుగు అంగన్వాడీ కేంద్రాలను ఒకే భవనంలో కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క కేంద్రంలో దాదాపుగా 18 మంది పిల్లలు ఉన్నారు. ప్రస్తుత భవనంలో ఒక గది, వరండా మాత్రమే ఉన్నాయి. గదిలో నాలుగు కేంద్రాల సామగ్రి ఉంచడానికే చాలడం లేదు. వరండాలో 72 మంది పిల్లలను కూర్చోబెట్టి నాలుగు వైపులా నలుగురు టీచర్లు పర్యవేక్షిస్తుండటాన్ని చిత్రంలో చూడొచ్చు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడలు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు మంగళవారం కల్వకుర్తికి చేరుకున్నారు. గురుకుల సొసైటీ పరిధిలోని మొత్తం 16 పాఠశాలల నుంచి సుమారు 540 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు తెలిపారు.

కోయనగర్ సమాఖ్య ఆర్పీ శ్రీలతపై కేసు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : స్వయం సహాయక సంఘాల డబ్బులను పక్కదారి పట్టించిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ)పై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామీణా ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ పట్టణం వేంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీలత మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్నారు. 2017 మార్చి నుంచి ఆమె కోయనగర్ మహిళా సమాఖ్య ఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 30 స్వయం సహాయక సంఘాలకు చెందిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పొదుపు డబ్బులు రూ.1,49,36,205 పక్కదారి పట్టినట్లు విచారణ తేలిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీశైలంలో 2 గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. ప్రాజెక్టు 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 55,508 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 66,331 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు జలాశయం నీటి మట్టం 884.30 అడుగులుగా (211.4759 టీఎంసీలు) ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల జలాశయం నుంచి 62,158 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 31,858 క్యూసెక్కుల వరద నీళ్లు శ్రీశైలంలోకి చేరుతోంది.



గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో రజతం



రజతం సాధించిన జట్టుతో సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: వరంగల్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు రజతం వరించింది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టును అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి సాదిఖ్‌అలి, ఉపాధ్యక్షుడు శరత్‌చంద్ర, కోశాధికారి ఆనంద్, సభ్యులు రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, శిక్షకులు కపిల్ వర్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారి వేధింపులు తాళలేక ఈవో వినోద మంగళవారం నిద్ర మాత్రలు వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలాలా ఉన్నాయి.. 2022 నవంబరులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా వినోద ఎంపికయ్యారు. పెబ్బేరులో విధుల్లో చేరాల్సి ఉండగా అప్పటి డీడబ్ల్యూవో పుష్పలత కార్యాలయ అవసరాల నిమిత్తం ఆమెను డిప్యూటేషన్‌పై జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఈవోగా తీసుకున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మమ్మ.. వినోదను పెబ్బేరు వెళ్లాలని ఒత్తిడి చేశారు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో కొంత సమయం కావాలని తర్వాత వెళ్తానని చెప్పినా వినకుండా లక్ష్మమ్మ సోమవారం ఇక్కడి నుంచి రిలీవ్ కావాలని అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. లక్ష్మమ్మ, మరో అధికారి వేధింపులతో మనస్తాపం చెంది నిద్ర మాత్రలు వేసుకున్నట్లు బాధితురాలు తెలిపారు. ఈ విషయమై లక్ష్మమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సూపర్‌వైజర్ల కొరత వల్ల ఆమె స్థానానికి వెళ్లాలని సూచించామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లపై పర్యవేక్షణ ఉండాలని అందుకోసం తప్పకుండా వెళ్లాలని సోమవారం ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. బాధితురాలు తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలన్నారు.

వసతిగృహంలో బీటెక్ విద్యార్థి బలవన్మరణం

మేడ్చల్, న్యూస్‌టుడే: వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సిద్ధార్థయాదవ్ (19) మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లోని వీఐపీ వసతి గృహంలో ఉంటున్నాడు. కిస్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం వసతిగృహానికి వచ్చాడు. మంగళవారం తోటి విద్యార్థులంతా కళాశాలకు వెళ్లారు. సిద్ధార్థయాదవ్ కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం తన గది లోపల నుంచి గడి పెట్టి ఉంది. తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఫోన్‌లో పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేస్తున్నారు.

లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం: ఒకరి దుర్మరణం

కృష్ణా, న్యూస్‌టుడే : వాసూనగర్ ఆర్టీవో చెక్‌పోస్ట్ ఎదురుగా ఆగి ఉన్న లారీని బైకుతో ఢీకొని మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి శేఖర్(36) మృతి చెందాడు. మంగళవారం కొత్తపల్లి నుంచి కర్ణాటకలోని దేవసూగూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను దేవసూగూర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శేఖర్‌కు భార్య, పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.



శేఖర్

అప్పు వివాదం... పరస్పరం కేసులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అప్పు విషయంలో చోటుచేసుకున్న వివాదంతో యువతి, యువకుడు పరస్పరం ఠాణాలో ఫిర్యాదు చేసుకున్న ఘటన ఇది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన రవీందర్‌నాయక్‌కి కొన్నాళ్ల క్రితం తన సోదరి ద్వారా గుంటూరుకు చెందిన శ్రావణి పరిచయం అయ్యింది. శ్రావణి అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. శ్రావణి తండ్రి అనారోగ్యంతో ఉండటంతో రవీందర్‌నాయక్ నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకుంది. రవీందర్ డబ్బుల కోసం ఫోన్ చేయగా దాటవేస్తూ వస్తోంది. ఈనెల 20న రాత్రి 9గంటల ప్రాంతంలో యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కులో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. కోపంతో శ్రావణి, రవీందర్‌నాయక్‌ను చెంపదెబ్బకొట్టింది. తర్వాత ఫోన్ చేయగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు దేవరాజ్, తేజ, కార్తీకేయ, ఇదాయత్ రవీందర్ నాయక్‌ను చితక్కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అప్పు తీసుకున్నందుకు తనను పెళ్లిచేసుకోవాలని వేధింపులకు గురిచేయడంతో పార్కుకు పిలిపించి, స్నేహితుల ముందు అవమాన పరిచాడని, దాడిచేసి గాయపరిచాడని రవీందర్‌నాయక్‌పై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125-00
రిటైల్	147-00
డ్రెస్డ్	213-00
స్కిన్‌లెస్	243-00

తెరపై ఈనాడు

శ్రీనివాస: దేవర, వెంకటేశ్వర: విశ్వం, శ్రీరామా: వెట్టయాన్

– న్యూస్‌టుడే, వనపర్తి న్యూటౌన్

కోటిలింగేశ్వరుడికి ఏకాదశరుద్రాభిషేకం

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కానాయపల్లి స్టేజీ వద్ద వెలసిన శ్రీ కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు జగదీశ్, అనిల్ తెలిపారు. స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా ఏకాదశరుద్రాభిషేకం, అర్చనలు జరిపించినట్లు వారు వివరించారు. ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడండి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ వినోద్‌కుమార్

ఆత్మకూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ వినోద్‌కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీల తాగునీటి సరఫరా సిబ్బందికి రక్షిత తాగునీటి సరఫరాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రక్షిత తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నిర్దేశించిన మేరకు నీటి శుద్ధి పరీక్షలను నిర్వహించాలన్నారు. పరీక్షల వివరాలను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీరాంరెడ్డి, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టాలి

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాధికారి జయరాములు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంగన్వాడీ 6వ కేంద్రంలో జరిగిన గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల కారణంగా అమ్మాయిలు తమ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిరోహించడంలో ఆటంకం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్, ఉపాధ్యాయులు పావని, సుమతి, అంగన్వాడీ కార్యకర్త భారతమ్మ, గ్రామ సమాఖ్య సభ్యులు అలివేల, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

పాన్‌గల్, న్యూస్‌టుడే: మండలంలోని రేమద్దుల గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు క్షయవ్యాధి, నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు తారాశశాంక్, లారెన్స్, సీహెచ్‌వో రామయ్య మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తే నిర్మూలన చేయవచ్చన్నారు. పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అనీమియా ముక్త్ భారత్ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంచందర్ ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పాన్‌గల్, న్యూస్‌టుడే: మండలంలోని మల్లాయిపల్లి గ్రామానికి చెందిన మణెమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. దీంతో గ్రామానికి చెందిన వాల్మీకి బోయ కులస్థులు మంగళవారం రూ.46,500 ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్తులో కూడా తమ వంతుగా సహాయం అందించడానికి కృషిచేస్తామని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు.

ఎమ్మెస్ఎఫ్ సభ విజయవంతం చేయండి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 24న జరిగే మాదిగ విద్యార్థి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మెస్ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మహేశ్ కోరారు. మంగళవారం పట్టణంలోని పీజీ, డిగ్రీ కళాశాల్లో మాదిగ విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరుశరాము, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, పవన్‌కల్యాణ్, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మంటలు..సామగ్రి దగ్ధం

ఖిల్లాగణపురం, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని వీరన్నగుట్టపై వెలసిన వీరభద్రస్వామి ఆలయంలో మంటలు వచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్లు వీడియోలను యువకులు సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై సురేశ్‌గౌడ్‌ను వివరణ కోరగా ఈ ఘటన ఈనెల 13న జరిగినట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి పరిశీలించినట్లు తెలిపారు. ఆలయంలో పూజా సామగ్రితో పాటు దేవతామూర్తుల విగ్రహాలు దగ్ధమైనట్లు తెలిపారు. ఆలయంలో వెలిగించిన దీపం ద్వారా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టనున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి ఘటనలో నిందితుడికి రిమాండ్

ఖిల్లాగణపురం: ఈ నెల 8న మండల పరిధిలోని మానాజీపేట గ్రామంలో మాజీ సర్పంచి సతీశ్‌కుమార్ పై జరిగిన దాడి ఘటనలో నిందితుడు బాలరాజును సోమవారం రాత్రి అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సురేశ్‌గౌడ్ తెలిపారు. దాడి ఘటనలో నిందితులందరిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామని అలాగే త్వరగతిన విచారణ పూర్తి చేసి ఛార్జీ షీటును కోర్టులో సమర్పించనున్నట్లు ఎస్సై తెలిపారు.

రిమోట్‌తో పత్తి తూకంలో మోసం

అమరచింత, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని పీజేపీ మస్తీపూర్ మలుపులో ఉన్న ఓ దుకాణంలో జోగులాంబ గద్వాల జిల్లా అయిజకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి పత్తి వ్యాపారం చేస్తున్నారు. ఈ ప్రాంతంలోని రైతులు రాయచూర్‌కు తీసుకెళ్లలేని వారు ఇక్కడే విక్రయిస్తున్నారు. ఇక్కడ నుంచి ప్రతి రోజు రెండు, మూడు లారీల పత్తి రాయచూర్‌కు వెళ్తుంది. తూకంలో తేడా ఉన్నట్లు రైతులు తూనికలు, కొలతల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మంగళవారం ఉదయం తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ వచ్చి పరిశీలించారు. తూకంలో ఐసీలు ఏర్పాటు చేసి రిమోట్ ద్వారా 30 కేజీల పత్తిని 25 కేజీలు స్క్రీన్ మీద చూపే విధంగా సరిచేసినట్లు అధికారులు గుర్తించారు. అక్కడ దుకాణ యజమాని లేరని లారీ వెంట ఇప్పుడే వెళ్లారని తెలపడంతో వారు ధరూర్ పోలీస్ ఠాణాకు సమాచారం ఇచ్చి లారీ నిలిపివేయాలని సూచించారు. నిర్ణీత బరువు కంటే తక్కువ బరువు నమోదైన డిజిటల్ ఎలక్ట్రానిక్ కాంటాను స్వాధీనం చేసుకుని దుకాణాదారుడిపై కేసు నమోదు చేశామని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు.

అస్తవ్యస్త రోడ్లపై అవస్థల ప్రయాణం


గుంతలమయంగా మారిన చాకల్‌పల్లి రోడ్డు


లక్ష్మీదేవమ్మపల్లి సమీపంలో తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు

గోపాల్‌పేట, న్యూస్‌టుడే: గోపాల్‌పేట నుంచి నాగర్ కర్నూల్ (వయా చాకల్‌పల్లి) వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గోపాల్‌పేట నుంచి చాకల్‌పల్లి, లక్ష్మీదేవమ్మపల్లి, తూడుకుర్తి, శ్రీపురం గ్రామాల మీదుగా నాగర్‌కర్నూల్‌కు వెళ్తుంది. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డుపై ప్రతిరోజూ వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అడుగడుగునా గుంతలమయమైన ఈ రోడ్డు పైనే చాకల్‌పల్లి శివారులో కేఎల్ఐ డీ-8 కాలువను నిర్మించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా కాలువపై వంతెనను నిర్మించారు. వంతెనకు అటు ఇటు వైపుల రోడ్డు కోతకు గురై, గుంతలమయమైంది. రైతులు పైపులు వేసేందుకు బీటీ రోడ్డును అక్కడక్కడ తవ్వడంతో గుంతలు పడ్డాయి. వర్షం పడినప్పుడు గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. లక్ష్మీదేవమ్మపల్లి సమీపంలో కేఎల్ఐ నీరు వెళ్లడానికి రోడ్డును తవ్వి పైపులు వేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడ మట్టి రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్థులే పొక్లెయిన్ సహాయంతో అప్పట్లో తాత్కాలికంగా మట్టిని పోసి రోడ్డును వేశారు. ఇక్కడ వంతెనను నిర్మించాల్సిన అవసరం ఉంది. తూడుకుర్తి వరకు ఈ బీటీరోడ్డు గుంతలమయమై ప్రయాణాలకు ప్రమాదకరంగా మారింది. గతంలో ఈ రోడ్డుపై అనేకచోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ఈ సమస్యపై ఆర్‌అండ్‌బీ ఏఈ రాకేశ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా గుంతలు పడిన మాట వాస్తవమేనని, వారం రోజుల్లో అవసరమైన కొన్నిచోట్ల తాత్కాలిక మరమ్మతులు చేయిస్తామన్నారు. లక్ష్మీదేవమ్మపల్లి సమీపంలో వంతెన నిర్మాణానికి అంచనాలు తయారుచేసి పంపుతామని, నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపడుతామన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి


నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల ఉపాధ్యాయులు

పెద్దమందడి (వనపర్తి న్యూటౌన్), న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీలకు సంబంధించిన ఆర్థిక పరమైన బిల్లులు చెల్లించాలని తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్‌గౌడ్ అన్నారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని బలిజపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమానికి జీహెచ్ఎంల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మంజులత, పీఆర్టీయూ, యూటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్తకోట: పెండింగ్‌లో ఉన్న పీఆర్సీతో పాటు ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తపస్ (తెలంగాణ ఉపాధ్యాయ సంఘం సత్యాగ్రహ దీక్షను చేపట్టింది. అందులో భాగంగా కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంలు నిర్మలాదేవి, వివేకానంద, ఈశ్వర్ పాల్గొన్నారు.

అర్చకులకు రెండు పడక గదుల ఇళ్లు కట్టించాలి

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ధూపదీప నైవేద్య పథకంలో ఉన్న అర్చకులకు ప్రభుత్వం ఆలయాల దగ్గరే రెండు పడకల గదుల ఇళ్లు నిర్మించాలని డీడీఎన్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మికాంతాచార్యులు అన్నారు. మన ఊరు మన గుడి మన అర్చకుడు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామమ్మపేటలో మంగళవారం శ్రీఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ధూపదీప నైవేద్యం పథకం కింద ఉన్న అర్చకులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, కోశాధికారి బాల లింగయ్య, కార్మదర్శి విరాటాచార్యులు, మండల ఇన్‌ఛార్జి నవీనాచార్యులు, జిల్లా అర్చకులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి

పాన్‌గల్, న్యూస్‌టుడే: ప్రాథమిక స్థాయిలోనే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతో పాటు గణితంలో ప్రాథమిక నైపుణ్యాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్, లిప్ కార్యక్రమంపై మండలస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు శివయ్య, జమీల్‌పాషా, షేక్యానాయక్, కృష్ణ, విజయలక్ష్మి, ఎస్‌వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకారం అందించాలి: ఎమ్మెల్యే


బిందెలో శుద్ధజలాన్ని పట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

శ్రీరంగాపురం, న్యూస్‌టుడే: గ్రామానికి చెందిన వారు అన్ని విధాల తమవంతు సహకారాన్ని అందించడం ద్వారా గ్రామాభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మండలంలోని శేరుపల్లి ప్రాథమిక పాఠశాలలో, గ్రామానికి చెందిన చీర్ల నాగరాజు, రూ.55 వేల తన సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన శుద్ధజల కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. పార్టీల అతీతంగా అందరు సహకరిస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మన పిల్లలకు మంచి చదువును అందిస్తే, వారే కొంత మందికి ఉపాధి చూపించే స్థాయికి ఎదుగుతారన్నారు. పాఠశాల అభివృద్ధి సహకరించిన ప్రతి ఒక్కరి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం విద్యను బలోపేతం చేసేందుకు కోట్ల రూపాయలను ఖర్చుచేసి, పాఠశాల భవనాలకు మరమ్మతులు చేయించిదన్నారు. పాఠశాలలో గదుల కొరత ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే గదుల నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నాగరాజును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మండలాధికారులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్ల పంపిణీ


దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేస్తున్న మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి

పెబ్బేరు పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వికలాంగులకు మంగళవారం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో అలిన్ సంస్థ వికలాంగుల విభాగం ఆధ్వర్యంలో ఏసిడ్ బ్యాటరీ మోటార్ సైకిళ్లను మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు ప్రమోదినిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనువాసులు గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు రామన్‌గౌడ్, నరసింహనాయుడు, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భానుకుమార్, ప్రధాన కార్యదర్శి బీచుపల్లి, సురేందర్ గౌడ్, యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

మదనాపురం, న్యూస్‌టుడే: మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన శ్రావణి 7 నెలల గర్భిణి. మంగళవారం నొప్పులు రావడంతో 108 వాహనంలో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 108 సిబ్బంది కాన్పు చేశారు. శ్రావణి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన శిశువు 9నెలల పూర్తి కాకపోవడంతో వైద్యుల పర్యవేక్షణ నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నెలలు పూర్తికాక ముందే గర్భిణికి కాన్పు చేసిన 108 సిబ్బంది ఈఎంటీ రాము, పైలట్ అక్బర్‌ను వైద్యులు అభినందించారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి


వనపర్తిలో సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: పురపాలికలో పనిచేస్తున్న కార్మికులకు సకాలంలో వేతనాలివ్వాలని భాజపా నాయకులు కోరారు. మంగళవారం పురపాలిక కార్మికులు పలువురు పెండింగ్‌లో ఉన్న వేతనాలివ్వాలని రెండో రోజు నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు సమ్మెకు మద్దతు తెలిపారు. తొమ్మిది నెలలుగా కార్మికులకు వేతనాలు అందకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, నాయకులు సమ్మె మద్దతు తెలిపారు. అనంతరం వారు పుర కమిషనర్ పూర్ణచందర్ మాట్లాడారు. రెండు నెలల వేతనాలు కార్మికుల ఖాతాలో జమ చేశారు. దీంతో సమ్మెను కార్మికులు విరమించారు. కార్యక్రమంలో పుర కార్మికులు, భాజపా, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


అమరచింత: 9వ వార్డులో రహదారులు శుభ్రం చేస్తున్న ఆశ, మెప్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంతో పాటు పుర కార్యాలయాల ప్రాంగణాల్లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పురపాలిక పారిశుద్ధ్య సిబ్బంది, మెప్మా సిబ్బంది, వైద్యారోగ్య శాఖ సిబ్బంది సంయుక్తంగా ఆయా కార్యాలయాల ప్రాంగణాల్లో పెరిగిన ముళ్లపొదలను తొలగించారు. నీటి ట్యాంకుల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమాల్లో పురఛైర్‌పర్సన్ గాయత్రి, వైస్ ఛైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ చికినె శశిధర్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని నవయువ చైతన్యం యువజన సంఘం అధ్యక్షుడు రాజు అన్నారు. మంగళవారం నందిమల్ల గ్రామంలో మహబూబ్‌నగర్ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలోని రహదారులను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి, చెత్తచెదారాన్ని డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ముని, అంజి, శ్రీను, మణి, శ్రీకాంత్, శివమణి, శివశంకర్ పాల్గొన్నారు.

అమరచింత, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని పురఛైర్‌పర్సన్ వి.మంగమ్మ, కమిషనర్ నూరుల్ నజీబ్ అన్నారు. మంగళవారం 9వ వార్డులో 'డ్రైడే' కార్యక్రమం ఆశ, మెప్మా, అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలు తొలగించారు. దోమల నివారణకు ద్రావణం పిచికారీ చేయించారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో పుర ఛైర్‌పర్సన్ గాయత్రి, కమిషనర్ శశిధర్ తదితరులు

రహదారిపై మురుగుతో ఇబ్బందులు



వనపర్తి నుంచి కాశీంనగర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు నిలిచి బురదమయంగా మారింది. రహదారికి ఇరువైపుల కాల్వలు లేక నీరు నిలిచింది. ఈ రహదారిపై వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు నిల్వ ఉండ కుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, వనపర్తి గ్రామీణం

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గంతో సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్‌హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన రీజియన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటయ్య (అచ్చంపేట), ప్రధాన కార్యదర్శిగా దార సుందర్ (కల్వకుర్తి) ఉపాధ్యక్షులుగా వెంకటయ్య, భాస్కర్, రామన్న, మహిళా కార్యదర్శిగా భాగ్య, ప్రచార కార్యదర్శిగా సురేశ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గోపాల్, ఇమ్మానియెల్, యాదయ్యను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ పుర కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులును నియమించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ఛైర్మన్ రాజయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, కృష్ణ హాజరయ్యారు.

నాగర్‌కర్నూల్‌కు తరలివెళ్లిన యువత, ఔత్సాహికులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన స్వయం ఉపాధిపై అవగాహన సదస్సుకు మంగళవారం వనపర్తి నుంచి నిరుద్యోగ యువత, ఔత్సాహికులు, పారిశ్రామికవేత్తలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణం పాలిటెక్నిక్ కళాశాల మైదానం నుంచి డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, యువజన క్రీడల జిల్లా అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి జెండాను ఊపి ప్రారంభించారు.

లోవోల్టేజి విద్యుత్తుతో ఇబ్బందులు

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే: వనపర్తి పట్టణం శారదకాలనీలో లోవోల్టేజి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్తు సరఫరా తరచూ అంతరాయం కలుగుతుంది. టీవీలు, ఫ్రిజ్, ఫ్యాన్‌లు (పంకాలు), కూలర్స్ తదితరాలు కాలిపోతున్నాయి. లోవోల్టేజి సమస్యను తీర్చాలని విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదు. కాలనీలో అధికారులు స్పందించి నియంత్రికను ఏర్పాటు చేస్తే లోవోల్టేజి సమస్య తీరుతుంది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' టీజీ ఎస్పీడీసీఎల్ ఏఈ రాజయ్యను వివరణ కోరగా లోవోల్టేజి సమస్యను ఉన్నట్లు మా దృష్టికి వచ్చింది. కాలనీ వాసులు, కౌన్సిలర్‌తో చర్చించి నియంత్రిక ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

కురుమూర్తి ఉత్సవాలకు ముస్తాబు


జాతరకు ముస్తాబైన రాజగోపురం

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : పేదల తిరుపతిగా పేరు గాంచిన శ్రీ కురుమూర్తి స్వామివారి ఉత్సవాలు ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని స్వామివారి ఆలయాన్ని, రాజగోపురం, హనుమాన్ విగ్రహాన్ని రంగులు వేసి శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాటు చేసిన పుష్కరణీని ఆలయ అధికారులు శుభ్రం చేయించారు.

25న పారిశుద్ధ్య కార్మికుల చలో హైదరాబాద్

కొత్తకోట,న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ తెలిపారు. మంగళవారం పురపాలిక ఆవరణలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు రూ.26 వేల వేతనాలు డిమాండ్ చేస్తూ వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించేందుకు సీడీఎంఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృపయ్య, కురుమన్న, కొండన్న, రాజు, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడాలి

ఖిల్లాగణపురం: ప్రజలు హిందూ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాలని ఖిల్లాగణపురం బజారు ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. దేవాలయంలో ప్రతి మంగళవారం సత్సంగ్‌లో భాగంగా ఓవకార నాధం అనే కార్యక్రమాన్ని ఆరు వారాల నుంచి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి ఆలయంలో ప్రతి మంగళవారం ఓంకార నాధం అనే కార్యక్రమం చేపట్టాలని మండల ప్రజలకు వారు సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు, భజనపరులు పాల్గొన్నారు.

29న రైతు నిరసన సదస్సు


మాట్లాడుతున్న మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు ఈనెల 29న భారాస ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రైతు నిరసన సదస్సు నిర్వహిస్తున్నట్లు మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన భారాస ముఖ్య నాయకుల ఆయన మాట్లాడారు. భారీ స్థాయిలో నిర్వహించే రైతు నిరసన సదస్సుకు భారాస ముఖ్య నాయకుడు మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని చెప్పారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, రైతు డిక్లరేషన్ అమలు చేయకపోవడంతో రైతుల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రైతు నిరసన సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారాస జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

తుంగభద్రలో భారీగా పెరిగిన ప్రవాహం

శాంతినగర్, న్యూస్‌టుడే: తుంగభద్ర నదిలో ప్రవాహం భారీగా పెరుగుతోంది. మంగళవారం జలాశయం నుంచి 1,14,500 క్యూసెక్కుల నీటిని ఆర్డీఎస్ ఆనకట్టకు విడుదల చేశారు. ప్రస్తుతం ఆనకట్ట వద్ద 11.2 అడుగుల ఎత్తులో 53,250 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నట్లు ఏఈ రాందాస్ తెలిపారు. ప్రధానకాల్వకు 8.2 అడుగుల నీటిని విడుదల చేస్తుండగా, అది రాష్ట్రానికి వచ్చేసరికి 5 అడుగులుగా ఉంది. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. ఆర్డీఎస్ ప్రధానకాల్వలో ఎగువ నుంచి నీటిప్రవాహం ఎక్కువ ఉండటంతో పథకం నుంచి నీటిని నిలిపివేసినట్లు ఏఈ తెలిపారు.